ఆంధ్రజ్యోతి
సంక్రాంతి శుభాకాంక్షలు
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 15 జనవరి 2024



నారావారి పల్లెలో దీక్ష చేస్తున్న దామోదర నాయుడికి చంద్రబాబు సంఘీభావం

నారావారిపల్లెలో పండుగ సందడి

- చంద్రబాబు,లోకేశ్‌లకు స్వాగతం పలికేందుకు భారీఎత్తున తరలివచ్చిన టీడీపీ శ్రేణులు
- పార్టీ అధినేతలను కలిసిన పలువురు నాయకులు



నారావారిపల్లెలో స్వాగతం పలుకుతున్న ప్రజలకు చంద్రబాబు అభివాదం



హెలికాప్టర్ దిగుతున్న లోకేశ్

చంద్రగిరి, జనవరి 14: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కుటుంబం రాకతో ఆయన స్వగ్రామమైన నారావారిపల్లెలో సందడి నెలకొంది.ఏటా సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు కుటుంబసభ్యులు,బంధువులతో కలిసి చంద్రబాబు స్వగ్రామానికి రావడం ఒక సంప్రదాయంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.ఈసారి చంద్రబాబు తన కుమారుడు లోకేశ్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు హెలికాప్టర్‌లో ఎ.రంగంపేటకు చేరుకున్నారు. అక్కడ టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కాన్వాయ్‌లో నారా వారిపల్లెలోని స్వగృహానికి 1.25 గంటలకు చంద్రబాబు,లోకేశ్ చేరుకున్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ,షాజహాన్ బాషా,టీడీపీ నాయకులు నరసింహయాదవ్, గాలి భానుప్రకాష్,కొల్లూరు ఇందుశేఖర్,హేమాం బరధర రావు, పులివర్తి సుధారెడ్డి, పులివర్తి వినీల్, గురజాల జగన్మోహన్, సుబ్రమణ్యం నాయుడు, రవినాయుడు, కోడూరు బాలసుబ్రమణ్యం,గౌస్‌బాషా, కుమార రాజా రెడ్డి, శివకోటేశ్వరరెడ్డి, గిరిధర్‌రెడ్డి,బెల్లంకొండ రమేష్ తదితరులు చంద్రబాబు, లోకేష్‌లకు స్వాగతం పలికారు. చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు తొలగించాలంటూ నారావారిపల్లెలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న రైతు దామోదరనాయుడిని చంద్రబాబు పలకరించారు.పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరిస్తూ ఇంట్లోకి వెళ్లిన చంద్రబాబు, లోకేశ్ సాయంత్రం 4గంటలకు బయటకు వచ్చారు. సాయంత్రం 6 గంటల దాకా ఇంట్లోని తన చాంబర్‌లో పార్టీ నాయకులను కలిసి ఫొటోలు దిగారు.మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ నాయుడు, మునిరామయ్య,టీడీపీ నేతలు మురళీమోహన్, చక్రాల ఉష, చిట్టిబాబు నాయుడు తదితరులు చంద్రబాబును కలిసిన వారిలో వున్నారు.రాత్రి ఇంట్లో బంధువులకు, గ్రామస్తులకు విందు ఏర్పాటు చేశారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటలకు కుటుంబ సభ్యులతో కలసి చంద్రబాబు, లోకేష్ గ్రామ దేవత దొడ్డి గంగమ్మకు, కుల దైవం నాగాలమ్మకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం చంద్రబాబు తల్లిదండ్రులైన ఖర్జూర నాయుడు, అమ్మణ్ణమ్మ సమాధులకు నివాళులర్పిస్తారు.తరువాత గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించనున్నారు.మధ్యాహ్నం తరువాత చంద్రబాబు, లోకేశ్ తిరుగు ప్రయాణం కానున్నారు.

తిరుమలలో భోగి సంబరాలు



తిరుమల, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందు భోగి పండుగను వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఆలయ మహాద్వారం ముందు ఆలయ అధికారులు, సిబ్బంది భోగి మంటలు వేశారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు కూడా పాల్గొన్నారు.

అంగన్వాడీల సంతకాల సేకరణ

● భోగి పండుగ రోజూ రోడ్లపైనే


తిరుపతిలో సంతకాల సేకరణ

తిరుపతి (రవాణా), జనవరి 14 : చర్చలకు పిలిచి అవమానం చేస్తున్న ప్రభుత్వానికి సరైన గుణపాఠం నేర్పాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిన కోటి సంతకాల సేకరణ జిల్లాలోని పలు అంగన్వాడీల దీక్షా శిబిరాల్లో ఆదివారం ప్రారంభమైంది. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న పోరాటం ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. తిరుపతిలో సంతకాల సేకరణ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పేవరకు కోటి సంతకాలే కాదు రెండు కోట్ల సంతకాలు చేసేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అంగన్వాడీల పోరాటాన్ని ప్రజా పోరాటంగా మారుస్తామని హెచ్చరించారు. గూడూరులో అంగన్వాడీ కార్యకర్తలు జగనన్నకు చెబుతాం.. అనే కార్యక్రమంతో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కోటలో దీక్షా శిబిరం వద్ద గొబ్బెమ్మలు ఆడి నిరసన తెలిపారు. వెంకటగిరి, సూళ్లూరుపేటలో భోగిపండుగ రోజున దీక్షలు కొనసాగించారు. నాయుడుపేటలో చెవిలో పూలు పెట్టుకుని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. పండుగ పూట మట్టి తిని బతకాలా? జగనన్న అంటూ పుత్తూరులో అంగన్వాడీ కార్యకర్తలు ప్లేటులో మట్టిపోసుకుని నిరసన తెలిపారు. పిచ్చాటూరులో పండుగను పక్కనపెట్టి దీక్షా శిబిరం వద్ద ముగ్గులు వేసి సమ్మెలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు చక్రాల ఉష, జనసేన నాయకులు చక్రధర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. గొబ్బియాలు తట్టి పాటలు పాడి నిరసన తెలిపారు. మహిళలు పండుగపూట కూడా రోడ్లో రోదిస్తుంటే జగన్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై ఆమె మండిపడ్డారు.


స్వాగతం .. సుస్వాగతం..
మహోన్నతమైన సంకల్పం... ఉన్నతమైన ఆశయం కలిగిన
మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారాచంద్రబాబునాయుడు గారికి,
యువనేత శ్రీ నారా లోకేష్ గారు సంక్రాంతి సంబరాలకు
నారావారిపల్లెకు విచ్చేయుచున్న శుభ సందర్భంగా
వారికి స్వాగత సుమాంజలి మరియు
తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు,
అభిమానులకు హృదయపూర్వక
సంక్రాంతి శుభాకాంక్షలు
పూకా విజయ్‌కుమార్
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,
తిరుపతి
జె.బి. శ్రీనివాస్
తెలుగుదేశం పార్టీ నాయకులు,
తిరుపతి


BOOKINGS OPEN
HAPPY Makar SANKRANTI
మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
సంక్రాంతి శుభాకాంక్షలు
CPR CONSTRUCTIONS
SHAPING THE LIVES
A NEW Universe OF LUXURY
HIGH RISE GATED COMMUNITY APARTMENTS
3.25 ACRES
288 UNITS
8 FLOORS + C + G
15000 SFT. CLUBHOUSE
CPR COSMOS
THE WORLD OF HAPPINESS
For more details
CPR Constructions Pvt. Ltd.
+91 94920 13322/66/88
CPR COSMOS, Ward No. 19, Postal Colony, Besides Ankura Hospital, Renigunta Road, Tirupati
www.cprconstructions.com
AP RERA NO. P10110013755
Location QR Code
WEB QR CODE
TIRUPATI : Koramenugunta Postal Colony, Near Ankura Hospital, Tirupati - 517501.
HYDERABAD : Plot No. 5, CPR Brindavanam Apartments, Brindavan Colony, Opp. to Nectar Gardens, Madhapur, Hyderabad - 500 081.

బై బై.. వైసీపీ

- టీడీపీ, జనసేన ఉమ్మడి భోగి సంబరాలు
- ప్రజా వ్యతిరేక జీవోలు దగ్ధం




శ్రీకాళహస్తి జనవరి 14: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలంతా శాశ్వతంగా బాయ్ బాయ్ చెప్పాలని టీడీపీ, జనసేన నాయకులు ఉమ్మడిగా నినదించారు. పట్టణంలోని ఆర్టీసీ కూడలిలో ఆదివారం సాయంత్రం రెండు పార్టీలు సంయుక్తంగా భోగి సంబరాలు నిర్వహించారు. వైసీపీ ఇచ్చిన అబద్ధపు హామీలు, ప్రజా వ్యతిరేక జీవోల ప్రతులను భోగిమంటల్లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బై బై జగన్, బై బై మధు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య, జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత తదితరులు పాల్గొన్నారు.

'గురజాల'కు పలువురి శుభాకాంక్షలు



చిత్తూరు రూరల్, జనవరి 14: జీజేఎం ట్రస్టు చైర్మన్, టీడీపీ సీనియర్ నేత గురజాల జగన్మోహన్ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం రాత్రి చిత్తూరులోని ఆర్ఎల్ఎన్ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు, ప్రజలు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బిగ్‌బాస్ ఫేమ్ గీతు రాయల్, సీనియర్ ఎన్టీఆర్, బాలకృష్ణ డూప్‌లతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, మాజీ మేయర్ హేమలత, జీడీ నెల్లూరు ఇన్‌చార్జ్ థామస్, రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, నేతలు కాజూరు బాలాజీ, మహదేవ సందీప్, వసంత్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అర్ధరాత్రి 12 గంటలకు కేకు కట్ చేశారు.





రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్నేహితుల దుర్మరణం


రాంకీ, గౌతమ్, మునిరాజ (ఫైల్ ఫొటోలు)

దొరవారి సత్రం, జనవరి 14: దొరవారిసత్రంలో ఆదివారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు దుర్మరణం పాలయ్యారు.పోలీసుల కథనం మేరకు.... దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామానికి చెందిన కన్నలి గౌతమ్(23), పెళ్ళకూరు మండలం జీలపాటూరుకు చెందిన కోగిలి రాంకీ(24), నాయుడుపేట పట్టణం లోతువాని గుంట ప్రాంతానికి చెందిన కురుగొండ మునిరాజ(28) స్నేహితులు. వీరిలో రాంకీ, గౌతమ్ దగ్గర బంధువులు కూడా.శనివారం అర్ధ రాత్రి వరకు నాయుడుపేటలో భోగి సంబరాల్లో గడిపిన వీరు తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో బైకులో సూళ్లూరుపేటకు బయల్దేరారు. కలగుంట వంతెన వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టి రోడ్డుపై పడిపోయారు.ముగ్గురి తలలకూ బలమైన గాయాలు కావడంతో ప్రమాద స్థలంలోనే రాంకీ, గౌతమ్ చనిపోయారు. మునిరాజను పోలీసులు నాయుడుపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మద్యం మత్తు, దట్టమైన పొగమంచు కారణంగా ముగ్గురు యువకులూ ప్రమాదం పాలైనట్లు పోలీసులు భావిస్తున్నారు.

శ్రీసిటీ వెంచర్ సీఈవోకు అవార్డు

శ్రీసిటీ, జనవరి 14: శ్రీసిటీలోని వెంచర్ ఆటోమోటివ్ కూలింగ్ పరిశ్రమ సీఈవో శరవణన్ జానకి రామన్‌ను యురే షియన్ బిజినెస్ సమ్మిట్ ఇంటర్నే షనల్ అచీవర్ అవార్డు వరించింది. ఇటీవల లండన్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో జరిగిన యురేషియన్ బిజినెస్ సమ్మిట్‌లో శరవణన్‌కు అవార్డు ప్రదానం చేశారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, జనవరి 14 : రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి (40)మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ నరసింహులు కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని మిట్టకండ్రిగ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలిం చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎడమ ఛాతీ, కుడి చేతిపై పుట్టుమచ్చలు ఉన్నాయి.

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 14: టిప్పర్ ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వరదయ్యపాళెం మండలం కాంబాకం గ్రామానికి చెందిన నరేష్(22) వేణుగోపాల పురం గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున భోగి మంటలు వేసేందుకు గ్రామంలోనే తడ వైపు వెళ్లే రోడ్డులో నడిచి వెళ్తుండగా టిప్పర్ ఢీకొనడంతో మృతిచెందాడు. నరేష్ మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

16న తిరుపతి నుంచి అజ్మీర్‌కు ప్రత్యేక రైలు

రేణిగుంట, జనవరి14: రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరుగుతున్న ఉరుసు ఉత్సవానికి ముస్లిం భక్తుల కోసం 16న ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ సీహెచ్ రాకేష్ తెలిపారు. తిరుపతి నుంచి ఈ ప్రత్యేక రైలు(07227) మంగళవారం ఉదయం 8.10 గంటలకు బయలు దేరుతుందని వివరించారు. మళ్లీ అజ్మీర్‌లో ఈ రైలు(07228) ఈ నెల 21 తేదీ రాత్రి 11.20 గంటలకు తిరుపతికి బయలుదేరుతుందని వివరించారు.

కోడి పుంజుల స్వాధీనం

ఏర్పేడు, జనవరి 14: ఏర్పేడు మండలంలో పెనుమల్లం వద్ద నిర్వహిస్తున్న కోడిపందేలపై ఏర్పేడు సీఐ శ్రీహరి, ఎస్‌ఐ జిలానీ, ఏఎస్‌ఐ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేపట్టారు. మనోహర్, మహేష్, మల్లికార్జున్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఓ ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు, రెండు కోళ్లు, రూ.13,780 నగదు స్వాధీనం చేసుకున్నారు. ● మన్నసముద్రం గ్రామంలో జరుగుతున్న కోడిపందేలపై దాడి చేసి వెంకటరెడ్డి, మునస్వామిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోళ్లు, రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నారు.

చంద్రబాబుకు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి జనవరి 14: టీడీపీ అధినేత చంద్రబాబుకు డాక్టర్ పోతుగుంట రాజేష్‌నాయుడు ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. ఆదివారం నారావారిపల్లెకు వచ్చిన ఆయనకు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల చిత్రపటం అందించారు.

చిందేపల్లి జగనన్న కాలనీలో చోరీ

ఏర్పేడు, జనవరి 14: ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామం వద్ద ఉన్న జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం కోసం ఉంచిన 120 స్టీల్ రాడ్‌లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆటోలో తరలిస్తుండగా పోలీసులు వారిని వెంబడించి స్టీల్ రాడ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

దార్శనికత్వం...కవిత్వం

శ్రీకాళహస్తి, జనవరి 14: కవులు, రచయితలు సమాజంలోని పలు అంశాల పట్ల దూరదృష్టితో ఆలోచించి రాసే సమాజ దార్శనికులని విశ్రాంత ప్రిన్సిపాల్ లగడపాటి కిరణ్మయి అన్నారు. సంక్రాతి పురస్కరించుకొని ఆదివారం శ్రీకాళహస్తిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళా వేదిక ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి ఆధ్వర్యంలో కవిసమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కిరణ్మయి మాట్లాడుతూ తన తండ్రి ప్రముఖ రచయిత లగడపాటి భాస్కర్ పేరుతో ప్రతి ఏటా ఇద్దరి సాహితీ వేత్తలకు పురస్కారం అందిస్తామని ప్రకటించారు. అనంతరం కవులు అన్నపూర్ణమ్మ, చెంచుకృష్ణ పిళ్ళై, చేను వెంకట స్వామి, శంకరరాజు, షణ్ముగం, గాంధీ, తంగిరాల లక్ష్మీ ప్రసాద్, కస్తూరయ్య, జగన్నాథం, సహదేవుడు, మంజునాథ్ తదితర కార్యవర్గ సభ్యులు కవితలు ఆలపించారు. కవులను సత్కరించారు. హెచ్ఎం చంద్రబాబు, వేదిక కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ ట్యాబు చోరీ

శ్రీకాళహస్తి, జనవరి 14: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో పనిచేసే పూజ అనే పీజీ డాక్టరు ట్యాబు చోరీకి గురైంది. ఆమె ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాలను పరిశీలించగా ఎవరో ఓ మహిళ ఆస్పత్రిలో సంచరించడాన్ని గుర్తించారు. ఆమెపై అనుమానం వ్యక్తం చేశారు.

చెరువులో పడి యువకుడి మృతి

కేవీబీపురం, జనవరి14: మండలంలోని దిగువపుత్తూరు గ్రామానికి చెందిన ఆర్ముగం (25) చెరువులో పడి చనిపోయాడు. పశువులను మేతకు తోలుకెళ్లిన ఆర్ముగం రామయ్యచెరువు గట్టుపై నడుస్తూ ప్రమాద వశాత్తు చెరువులో పడి మృతిచెందాడు.





ముగిసిన ధనుర్మాస సంకీర్తనలు

తిరుపతి (కల్చరల్), జనవరి 14: ధనుర్మాసం ముగుస్తున్నసందర్భంగా బండ్లవీధి లోనిభజనగుడి ఆధ్వర్యంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న సంకీర్తనలు ఆదివారం ముగిశాయి. టౌన్‌బ్యాంక్ మాజీ అధ్యక్షుడు తొండమనాటి వెంకటేష్ రెడ్డి, భజనమందిరం అధ్యక్షుడు పులుగోరు ప్రభాకరరెడ్డి, బీజేపీ నేత గుండాల గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన కీడు పోవాలి...

చంద్రన్న రాజ్యం రావాలి

భోగి మంటల్లో ప్రజా వ్యతిరేక నిర్ణయాల ప్రతుల దహనం

తిరుపతి, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పట్టిన కీడు పోవాలని..చంద్రన్న రాజ్యం రావాలని కోరుతూ ప్రజా వ్యతిరేక నిర్ణయాల ప్రతులను టీడీపీ నేతలు ఆదివారం భోగిమంటల్లో దహనం చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసం ఎదుట వేకువజామున స్థానిక నేతలు భోగిమంట వేశారు. సుగుణమ్మ మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు, కరెంటు బిల్లుల బాదుడు, గుంతల రోడ్లు, జాబ్ క్యాలెండరు ప్రకటించకపోవడం, రైతులను నట్టేట ముంచడం వంటి నిర్ణయాలతో రాష్ట్రాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. బ్రిటీష్ పాలనే నయమన్నట్టుగా జగన్ రెడ్డి వ్యహరిస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ-జనసేన సంకీర్ణ ప్రభుత్వంతోనే ఏపీకి మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీఎల్ సంజయ్, ఆర్సీ మునికృష్ణ, బుల్లెట్ రమణ, మహేష్ యాదవ్, కంకణాల రజనీకాంత్, కరాటే చంద్ర, విశ్వనాథం, జిమ్ ప్రకాష్, ఆముదాల తులసి, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



భోగిమంటల్లో ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ నేతలు

శ్రీవారి హుండీ ఆదాయం

రూ.3.78 కోట్లు

తిరుమల, జనవరి14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.78 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 65,962 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,575 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీ గోశాలలో

16న కనుమ పండగ

తిరుపతి (కల్చరల్), జనవరి 14 : టీటీడీ గోశాలలో ఈనెల 16వ తేదీన కనుమ పండగ నిర్వహించనున్నట్లు టీటీడీ తెలిపింది. వేణుగోపాలస్వామి సన్నిధిలో గోపూజ, హారతి, తులసిపూజ, గొబ్బెమ్మ వేడుక, గజపూజ, అశ్వపూజ, వృషభ పూజ నిర్వహిస్తారని పేర్కొంది. హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి హరిదాసులు, బసవన్నల నృత్యం ఉంటాయని తెలిపింది. మధ్యాహ్నం నుంచి స్వామి దర్శనం, ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొంది.



గోవిందరాజస్వామి ఆలయంలో భోగితేరు - మధురానగర్‌లో భోగి మంటలు

సందడిగా భోగి పండగ

తిరుపతి (కల్చరల్), జనవరి 14 : సందడిగా మొదలైన సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆదివారం భోగి పండగ సంప్రదాయరీతిలో జరుపుకున్నారు. ఉదయమే వాకిళ్ల ముందు పాత వస్తువులతో భోగి మంటలు వేశారు. ఆ మంటల్లో కాచుకున్న వేడినీటితో స్నానం చేశారు. కొత్త బట్టలు ధరించి, పిండి వంటలతో సంబరాలు చేసుకున్నారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. అధికారులు, పర్యావరణ ప్రియులు హెచ్చరిస్తున్నా పలువురు భోగి మంటల్లో రబ్బరు వస్తువులు వేయడంతో వాతావరణం పొగతో నిండిపోయింది.

భోగి తేరులో గోవిందరాజులు: గోవిందరాజస్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు భోగి తేరు ఉత్సవం నిర్వహించారు. ఆండాల్ సమేత శ్రీకృష్ణస్వామి ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మకరసంక్రాంతిని పురస్కరించుకుని ఉదయం 6.30 గంటలకు శ్రీచక్రత్తాళ్వారును గోవింద రాజస్వామి ఆలయం నుంచి కపిలతీర్థం(ఆళ్వారు తీర్థం)కు తీసుకువస్తారు. అక్కడ చక్రస్నానం, ఆస్థానం జరుగుతుంది. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి పురవీధుల్లో ఊరేగుతారు. ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఆలయంలో గోదాకల్యాణం జరుగుతుంది. 17న పార్వేట ఉత్సవం ఉంటుంది.



వైభవంగా గోదా కల్యాణం

తిరుపతి (కల్చరల్), జనవరి 14: ధనుర్మాసం ముగింపు సందర్భంగా అన్నమాచార్య కళా మందిరంలో నిర్వహించిన తిరుప్పావై ప్రవచనాలు ఆదివారంతో పూర్తయ్యాయి. టీటీడీ ఆళ్వారు దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గోదాకల్యాణం నిర్వహించారు. ప్రముఖ గాయని ద్వారం లక్ష్మి సంగీత విభావరి నిర్వహించారు. తిరుపతికి చెందిన భానుజ బృందం నృత్య ప్రదర్శన ఇచ్చింది. టీటీడీ ఎఫ్ఏసీఏఓ బాలాజీ, ధార్మిక ప్రాజెక్టుల ఏఈవో శ్రీ రాములు, ఆళ్వారు దివ్యప్రభంద ప్రాజక్టు అధికారి పురుషోత్తం పాల్గొన్నారు.

చంద్రగిరిలో కొత్త ఓట్లు
ఎక్కువేమీ లేవు

- ఏడాదిలో చేర్చింది 25వేల ఓట్లే
- ఫిర్యాదులన్నీ పరిష్కరించాం
- ఆర్డీవో నిషాంత్ రెడ్డి



తిరుపతి, జనవరి 14 (ఆంధ్ర జ్యోతి) : దేశవ్యాప్తంగా పెరిగిన జనాభా నిష్పత్తి మేరకే చంద్రగిరి నియోజకవర్గంలో కొత్త ఓటర్లు నమోదయ్యారని, అంతేగాని దొంగ ఓట్లు ఉన్నాయన్న వార్తల్లో నిజం లేదని ఆర్డీవో నిషాంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో 2019లో 2,91,000 ఓట్లు ఉంటే ప్రస్తుతం 3,08,000 ఓట్లు మాత్రమే ఉన్నాయన్నారు. అంటే గడిచిన ఐదేళ్లలో 17వేల ఓట్లు మాత్రమే పెరిగాయని చెప్పారు. తిరుపతి నగరాన్ని కేంద్రంగా చేసుకుని ఇతర ప్రాంతాల నుంచి తిరుపతి రూరల్ పరిధిలోనే ఎక్కువగా పెరిగాయన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో చంద్రగిరి కంటే 20 నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరిగిందన్నారు. వైజాగ్, విజయవాడ, గుంటూరు నగర పరీవాహక నియోజకవర్గాల్లో ఓటర్లు గణనీయంగాపెరుగుతున్నారని చెప్పారు.వీటితర్వాత స్థానంలో తిరుపతి నగరం ఉందన్నారు. కర్నూలు సమీపంలోని పాణ్యం నియోజకవర్గంలో 34వేలు ఓట్లు పెరిగాయన్నారు. చంద్రగిరిలో గత ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు కొత్త ఓట్లు 25వేలు మాత్రమేనని, 18వేలు తొలగించామని, 1,600 డూప్లికేట్ ఓట్లు, ఒకే చిరునామాతో 230 ఉన్నాయని గుర్తించి విచారణ చేసి తీసేశామని అన్నారు. ఒకే ఇంట్లో పదిమందికన్నా ఎక్కువ ఉన్నవి 3,600 ఓట్లు గుర్తించి తొలగించామన్నారు. డిసెంబరు 9నాటికి వచ్చిన ఫిర్యాదులన్నింటికీ పరిష్కరించామన్నారు.నియోజకవర్గంలో 395 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, 2021లో 388 పోలింగ్ స్టేషన్లు ఉంటే కొత్తగా 7 కలిశాయన్నారు. గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో 30వేలు కొత్త గృహ విద్యుత్ కనెక్షన్లు వచ్చాయని, 7వేల హౌస్ నెంబర్లు వచ్చాయన్నారు. వీటిని పరిశీలిస్తే జనాభా పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

భోగి మంటల్లో సీపీఎస్, జీపీఎస్ ప్రతులు


ప్రతులను మంటల్లో వేస్తున్న చీర్ల కిరణ్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 14: సీపీఎస్ రద్దు చేయాలని, జీపీఎస్ వద్దంటూ సంబంధిత ప్రతులను ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర్ల కిరణ్ ఆదివారం ఉదయం భోగిమంటల్లో వేసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో ఉద్యోగులు నష్టపోవాల్సి వస్తుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఓపీఎస్ విధానం అమలు చేయాలని కోరారు.

చంద్రబాబు
పెద్దన్న పాత్ర పోషించాలి

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 14 : టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా చంద్రబాబు పెద్దన్న పాత్ర పోషించాలని కాపు నాయకులు కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ముఖ్యమంత్రి కావాలనేది కాపుల కోరికన్నారు. రెండు సామాజిక వర్గాల వారే రాష్ట్రాన్ని పాలిస్తూ తమ తమ వాళ్లకు మేలు చేకూర్చారన్నారు. ఈసారి అధికారంలోకి వస్తే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రెండున్నరేళ్ల ముఖ్యమంత్రులుగా ఉండాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాపులకు 80సీట్లు కేటాయించాలన్నారు. కాపు నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, రమేష్‌నాయుడు, గిద్ద శ్రీనివాస్‌నాయుడు, బెల్లంకొండ సురేష్, రాజేంద్ర, రామారావు పాల్గొన్నారు.

రేపు జూనియర్ బాలబాలికల
కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి(కొర్లగుంట), జనవరి 14 : ఈనెల 16న జూనియర్ బాలబాలికల జిల్లా కబడ్డీ జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆ సంఘం అధ్యక్షురాలు మమతరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హాజరయ్యే బాలబాలికలు 20సంవత్సరాలు లోపు, బాలురు బరువు 70కిలోల లోపు, బాలికల బరువు 65కిలోల లోపు ఉండాలని, ఆధార్ జిరాక్సు తీసుకు రావాలని పేర్కొన్నారు. సర్పంచ్ చిన్నదొరై, మండల పరిషత్ అధ్యక్షురాలు సింధుశ్యామ్ ఆధ్వర్యంలో నాగలాపురంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల మైదానంలో మంగళవారం 11 గంటల నుంచి పోటీలు జరుగనున్నాయని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9440345455, 7993014997లను సంప్రదించాలని కోరారు.